పశు బీమా.. లేదు ధీమా

- ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే అందని పరిహారం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో పాడి రైతులు



దెందులూరు: పాడి రైతులకు అండగా నిలిచే పశు బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. పాడినే నమ్ముకొని జీవించే వారు కష్టాలు పడాల్సి వస్తోంది. వర్షాకాలం కావడంతో అనుకోని విపత్తులతో పశువులు మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో పశు బీమా కొంత ఊరటనిస్తోంది. అలాంటి బీమాపై ఈ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగితే పాడి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

వ్యాధుల కాలం

వర్షాకాలంలో గేదెలు, ఆవులు, జీవాలకు హెచ్ఎస్ బీక్యూ, గాలికుంటు, థైలేరియా, తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగాఉన్నాయి. ప్రాణాంతక వ్యాధులు సోకడం వలన పశువులు మృత్యువాత పడుతుంటాయి. వీటికి తోడు వర్షా కాలంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుదాఘాతాలు సంభవించినప్పుడు పశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. లక్ష రూపాయలు అప్పు చేసి కొనుగోలు చేసిన పశువులు మృతి చెందితే ఆ రైతు పడే బాధ వర్ణనాతీతం. పశు బీమా ద్వారా సాయం అందితే కొంత ఉపశమనం కలుగుతుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో

దెందులూరు నియోజకవర్గంలో పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	మేకలు	గొర్రెలు
ఏలూరు	539	5607	1157	3148
పెదపాడు	918	8658	3977	1699
దెందులూరు	1287	12,978	3107	27,126
పెదవేగి	5299	45,970	13,321	24,804

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పశు బీమా పథకం పక్కాగా అమలు చేశారు. పాడి పశువు మృతి చెందితే రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు పరిహారం అందించి ఆదుకుంది. ప్రభుత్వం తరఫున పశు వైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించేవారు. అందులో రైతు వాటా కింద 3.5 శాతం బీమా ప్రీమియం ఉండేది. దీని వలన రైతుకు కొంతమేర ఉపయోగంగా ఉండేది. క్షీరసార పథకం ద్వారా 6, 7 నెలల చూడితో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బీమా సౌకర్యం లేకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పశుబీమాపై ఇంతవరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం.

బీమా సౌకర్యం కల్పించాలి



పశువులకు బీమా సౌకర్యం కల్పించాలి. గతంలో ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. ప్రమాదవశాత్తు జీవాలు మృత్యువాతపడితే పూర్తిగా నష్టపోతాం. రెండు పాడి ఆవులు కొనాలంటే ఇప్పుడు రూ.లక్షన్నర ఖర్చు అవుతోంది. పశుపోషణ కూడా భారంగా మారింది. ఇలాంటి సమయంలో పశు పోషణ వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది.
– సనివల్లి రామకృష్ణ (విష్ణు), రైతు, సర్పంచ్ సానిగూడెం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

ప్రస్తుతం ఆవులు, గేదెలు ఇతరత్రా పెంపుడు జీవాలకు సంబంధించిన బీమా ప్రీమియం కట్టించుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇంతవరకు అందలేదు. బీమా సౌకర్యంపై చాలా మంది రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బీమా సౌకర్యం కల్పిస్తాం.
– డాక్టర్ హరికృష్ణ, దెందులూరు మండల పశువైద్యాధికారి

క్లుప్తంగా

సీతారాములకు విశేష పూజలు



గుండుగొలనులో స్వామి వార్ల కల్యాణ తంతును నిర్వహిస్తున్న అర్చకులు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీసీతారామస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రీతికరమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

హౌసింగ్ డీఈగా వివేకానంద



దెందులూరు: గృహ నిర్మాణ శాఖ ఏలూరు డివిజనల్ ఇంజనీర్‌గా దెందులూరు ఏఈ టీవీ వివేకానంద నియమితులయ్యారు. ఇప్పటి వరకు డివిజనల్ ఇంజనీర్‌గా ఉన్న ధనుంజయ్‌రావు శ్రీకాకుళం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. బుధవారం కార్యాలయంలో డీఈ గా వివేకానంద ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర పోటీలకు కైకరం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

ఉంగుటూరు: అండర్–17 ఈత పోటీలకు కైకరం హైస్కూలు విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఎస్.దివ్య నాగదుర్గ సత్య, బి.కృష్ణచైతన్య బి.నాగదుర్గ చైతన్య కె.యశ్వంత్ బి.జోసఫ్‌మెరిన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను పాఠశాలలో బుధవారం హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు.

విశ్వకర్మ ప్రతిభను ప్రపంచానికి చాటారు



విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

ఉంగుటూరు: విశ్వకర్మ భగవాన్ ప్రతిభను ప్రపంచానికి చాటిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అనుపోజు బ్రహ్మం అన్నారు. బుధవారం ఉంగుటూరు, చేబ్రోలు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణ జయంతిని నిర్వహించారు. అనంతరం పేదలకు బిర్యానీ పంపిణీ చేశారు. క్యాక్రమంలో సంఘ ప్రతినిధులు నిడదవోలు రవితేజ వానపల్లి వీర్రాజు, కొక్కొండ రాంబాబు, కె.రవిశంకర్, కె.బ్రహ్మం, ఎం.సోమాచార్యులు, గోపాలం పాల్గొన్నారు.

తెలుగు భాష మహోన్నతం



తెలుగు పండితుడు విజయానందరాజును సన్మానిస్తున్న అధ్యాపకులు

గణపవరం: ప్రాచీన చరిత్ర కలిగిన తెలుగు భాష మహోన్నతమైనదని తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలందించిన మహనీయులు ఆదర్శనీయులని కృష్ణా జిల్లా తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు వై.విజయానందరాజు అన్నారు. బుధవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆయన తెలుగుభాష విశిష్టతపై అతిథి ఉపన్యాసం (గెస్ట్‌లెక్చర్) ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ కేవీ గణేష్, తెలుగు శాఖాధిపతి జి.వెంకట రమణ, పీడీ స్వాతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పరిశీలన

ఉంగుటూరు: ఉండి–చేబ్రోలు ఆర్అండ్‌బీ రహదారిలో ఏలూరు ప్రధాన కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి మరమ్మతులను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు బుధవారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లకు ఆదేశించారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులపై అంబేడ్కర్ చిత్రం వేయాలి

దెందులూరు: పౌర సరఫరాలశాఖ పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని ఏర్పాటు చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు గంటా పండు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం దెందులూరులో విలేకరులతో మాట్లాడుతూ దేశ భద్రత, భవిష్యత్ పాలన, అభివృద్ధి సంక్షేమంతో పాటు అనేక రంగాల కోసం ముందుచూపుతో బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందిస్తే ఆయనకు సరైన గుర్తింపు ఇవ్వాలన్నదే తమ అభిమతమన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గవర్నర్‌కు సంతకాలతో కూడిన లిఖిత పూర్వక వంచ పత్రాలను పంపుతున్నామన్నారు.

గణపవరాన్ని పశ్చిమలోనే కొనసాగించాలి

గణపవరం: గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపాలన్న నిర్ణయాన్ని ఏమాత్రం సహించబోమని, ఈ మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని గణపవరం మండల అఖిల పక్ష నాయకులు మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణకు విజ్ఞప్తి చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి రాజమహేంద్రవరం వచ్చిన మంత్రిని గణపవరం మండలం నుంచి అఖిలపక్ష నాయకులు బుధవారం రాజమహేంద్రవరం వెళ్లి మంత్రికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు యాళ్ల సుబ్బారావు, ఐఎస్‌రాజు, పల్లి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల సుధీర్‌కుమార్, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ముత్యాల వేణు, సర్పంచ్ బాతునాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష



భీమడోలు: సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు అరుణజ్యోతి, ప్రదీప్

భీమడోలు: మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష అని పూళ్ల వైద్యులు డాక్టర్ పి.అరుణజ్యోతి, డాక్టర్ ప్రదీప్ అన్నారు. పూళ్ల సచివాలయం వద్ద స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దాయం సుజాత అధ్యక్షత వహించారు. ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళ పరిణితి చెందిన కుటుంబాలను తీర్చిదిద్దుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ జి.శ్రీనివాసరావు, పి.మావుళ్లమ్మ, పెద్దలు మూర్తి, ప్రవీణ్‌కుమార్ పటేల్, మత్తే శ్రీనివాసశాస్త్రి, ఎం.కృష్ణకుమారిలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి

ఉంగుటూరు: మహిళలు బలంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని భావించే ప్రధాని నరేంద్ర మోదీ స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రాజశేఖర్, వైద్యులు శ్రావణ రెడ్డి, డి.శంకర ప్రసాద్, షాజియా, సుష్మా, సొసైటీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



దెందులూరు: కార్యక్రమాన్ని ప్రారంభించిన పోతునూరు పీహెచ్‌సీ వైద్యులు

కొవ్వలిలో స్వస్తి నారి సశక్తి

దెందులూరు: మహిళలు, బాలికల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ పథకం ప్రారంభించారని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చైతన్య, డాక్టర్ శాంతకుమారి అన్నారు. బుధవారం పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో కొవ్వలి ఉన్నత పాఠశాల మొట్టపర్తి భవన్‌లో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత గంగాధర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ప్రభాకర్ రావు, సూపర్‌వైజర్ హరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



ఉంగుటూరు: బాలికలకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

స్వచ్ఛ భారత్‌తో భాగస్వామ్యం కావాలి



మహిళలకు స్టీల్ వస్తువులను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెదవేగి: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పలువురు వక్తలు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని విజయరాయిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మేడిచర్ల కృష్ణ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణ, స్వదేశీ వస్తువుల వాడకం, సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలిదిండి సురేష్, అరె దుర్గా ప్రసాద్, దత్తి వినోద్, పందిరి రామారావు, నామన ధనయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవసేవే మాధవ సేవ

భీమడోలు: మానవ సేవే మాధవ సేవ అన్న నినాదంతో అఖిలాంధ్ర దివ్యాంగుల సేవా సమితి పని చేస్తుందని జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం అన్నారు. పాతూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం పీఎం నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందించారు. కార్యక్రమంలో మండే సుధాకర్, నక్కా రాము, ఎ.దుర్గాప్రసాద్, చిట్టూరి వాయునందన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజును బీజేపీ శ్రేణులు బుధవారం నిర్వహించారు. నీలాద్రిపురం, కాకర్లమూడి గ్రామాలలో కేకులు కట్ చేశారు. వృద్ధులకు పండ్లు, విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్ ,పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ, అడపాశోభారాణి, వంజరపు దుర్గారావు, వెంకటేశ్వరరావు, పరిమి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో గోదావరి కాలువ



కాలువలో కొట్టుకొస్తున్న కొండచిలువ కళేబరం

భీమడోలు: గోదావరి కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. కాలువలోకి విష సర్పాలు, జంతువుల కళేబరాలతో దుర్వాసన వెదజల్లుతుంది. బుధవారం భీమడోలు వద్ద కాలువలో భారీ కొండ చిలువ కళేబరం కనిపించడంతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. ఈ నీటిని కాలువ ఆనుకుని ఉన్న గ్రామాల్లోని ప్రజలు మంచినీటి అవసరాలకు, సాగునీటి అవసరాలకు వాడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గోదావరి కాలువ నీరు మురికిగా మారింది. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆ కళేబరాన్ని బయటకు తీసే ప్రయత్నాలు చేపట్టకపోవడం గమనార్హం.

మానవత సహాయం



కాంతమ్మకు సహాయాన్ని అందిస్తున్న మానవత సభ్యులు

ఉంగుటూరు: కైకరం గ్రామానికి చెందిన నిరుపేద గుడిసె నిర్మాణం కోసం మానవత సహాయాన్ని అందించింది. కాంతమ్మ నివాసం ఉంటున్న గుడిసె పాడవడంతో మానవత సభ్యులు స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం మానవత అధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనారాయణ, రీజనల్ చైర్మన్ పుప్పాల గోపి చేతుల మీదుగా రూ.13 వేలను అందజేశారు. కార్యక్రమంలో కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, తాతారావు, ఎర్రమిల్లిపాడు, సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు

దెందులూరు: దసరా ఉత్సవాలకు గ్రామ గ్రామాన యువత ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. దెందులూరు 2వ వార్డు స్థానిక యువత శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఏర్పాటు చేసేందుకు తాత్కాలిక పందిరిని ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులు పాటు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

నియోజకవర్గానికి ఒక పరిశ్రమల పార్క్

దెందులూరు: నియోజకవర్గానికి ఒక పరిశ్రమల పార్కు ఏర్పాటు చేస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం సోమవరప్పాడులో ఏపీఐఐసి ఆధ్వర్యంలో రైతులతో జరిగిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్‌డీఓ అచ్యుత అంబరీష్, తహశీల్దార్ బీ.సుమతి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: నిడమర్రు పనుల నిమిత్తం ఈ నెల 18వ తేదీ గురువారం నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, కావున రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిజాతగిరిలో పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు రెండో రోజుకు చేరాయి. విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనంతో ప్రారంభించి అనంతరం పంచగవ్య ఆరాధన, ప్రోక్షణ, తదితర పూజలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో యజ్ఞ బ్రహ్మ పానంగపల్లి సత్య పవనకుమారాచార్యులు, రుత్వికులు అభిరాం, నిరంజన్ స్వాములు వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

యూరియా నిల్వల పరిశీలన

బుట్టాయగూడెం: దర్భగూడెం, కామయ్యపాలెం సొసైటీల డీసీఎంఎస్ యూరియా నిల్వలను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా బుధవారం తనిఖీ చేశారు. కేఆర్‌పురం ఐటీడీఏ వ్యవసాయశాఖ ఏడీఏ పీజీ బుచ్చిబాబు, ఏఓ గంగాధర్, పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీదేవి సేవలు అభినందనీయం



ఎంపీడీఓ శ్రీదేవిని సత్కరిస్తున్న తహశీల్దార్ సుమతి

దెందులూరు: ఎంపీడీవో కె.శ్రీదేవి చేసిన సేవలు అభినందనీయమని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యాలయ ఏవో భీమరాజు, సిబ్బంది ఉపాధి ఏపీవో ఉద్యోగులు సంయుక్తంగా అభినందన సభ నిర్వహించి వీడ్కోలు పలికారు. ఎంపీడీవో గా అంకితభావంతో సేవలు అందించి జాతీయ ఉపాధి హామీ పథకం ఏలూరు జిల్లా ఫైనాన్స్ మేనేజర్‌గా పదోన్నతి పొందడం సంతోషంగా ఉందన్నారు. హౌసింగ్ డివిజనల్ ఇంజనీర్ వివేకానంద, ఏపీఎం సురేష్, పశువైద్యాధికారి హరికృష్ణ, వీఆర్‌ఏ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలు



క్యానర్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉంగుటూరు: గొల్లగూడెంలో క్యాన్సర్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్సు క్లబ్‌అధ్యక్షుడు పుసులూరి ప్రకాష్, లయన్సు ప్రతినిధులు లయన్ గుణ్ణం బుల్లబ్బాయి, నెక్కలపూడి సత్యనారాయణ, బాతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర



నేతలతో సమన్వయకర్త విజయరాజు

ఏలూరు టౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, చేయలేదనీ అసత్య ప్రచారం చేయటంతోపాటు మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ చేస్తోన్న కుట్రలకు నిరసనా ఈనెల 19న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు తెలిపారు. ఏలూరులో బుధవారం ఆయన చింతలపూడి నియోజకవర్గం యువజన, విద్యార్థి విభాగం నేతలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు చేపటట్టే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, కూటమి నేతలు, సీఎం చంద్రబాబు ఏమీ కట్టలేదంటూ అసత్య ప్రచారం చేయటం దారుణమని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వ కుట్రపూరిత రాజకీయాలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కదలిరావాలని కోరారు. 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏదైనా ఒక్క గొప్ప కార్యక్రమాన్ని చేశారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో ఏలూరు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొమ్మిన నరేష్, పార్టీ కామవరపుకోట మండల అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, తడికలపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు గుర్రాల రవికుమార్, జంగారెడ్డిగూడెం మండల యువజన అధ్యక్షుడు గంజి వినోద్, కుచలపాటి మహేష్, వానచర్ల లింగాస్వామి తదితరులు ఉన్నారు.

చలో 'మెడికల్ కాలేజీ' విజయవంతం చేయాలి

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 19వ తేదీనే విద్యార్థి యువజన విభాగాల ఆధ్వర్యంలో జరిగే ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు.

ఎలుకల నివారణతో అధిక దిగుబడులు



నిడమర్రు: ఎలుకల నివారణ మందును తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది



భీమడోలు: ఎలుకల నివారణ మందును పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

నిడమర్రు: ఎలుకలను నిర్మూలిస్తేనే ఆశించిన స్థాయిలో దిగుబడి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి ఇంగర్ దైవ ఆశీర్వాదం అన్నారు. బుధవారం అడవికొలను గ్రామంలో వరి దిగుబడిలో ఎలుకల నిర్మూలపై అవగాహన కార్యక్రమం వ్యవసాయ సిబ్బంది నిర్వహించారు.

సామూహిక ఎలుకల నివారణతో రైతుకు ఆర్థిక మేలు

భీమడోలు: రైతులు సామూహిక ఎలుకల నివారణ మందును వినియోగించుకుని ఆర్థిక మేలు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా అన్నారు. భీమడోలు, అంబర్‌పేట గ్రామాల్లో బుధవారం సామూహిక ఎలుకల నివారణ మందు ఉచితంగా పంపిణీ చేశారు. ఏడీఏ పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ మండల పరిధిలో 12873 ఎకరాలు సాగుతుండగా, 4500 రైతులకు ఉచితంగా 55 కేజీల మందును పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, ఏవో ఉషారాణి, వీపీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ ప్రారంభం

దెందులూరు: సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమారీ, దెందులూరు ఏవో ఎల్ శ్రీనివాసరాజు, గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు, నాయకులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), మాగంటి గిరి, రైతులు పాల్గొన్నారు.